# "కోరిక"

- డి.నర్సింగ్‌రావు



సాయంసమయం నీరెండ కాస్తోంది. బాలభానుడు తన పని అయిపోయినందున భూదేవికి వీడ్కోలు చెబుతూ వెళ్లలేక, వెళ్లలేక వెళుతూంటే, చంద్రుడు తన డ్యూటీకి టైం అయినందున హడావిడిగా పరుగెత్తుకొస్తున్నాడు. మబ్బుల చాటు నుండి చంద్రుడ్ని చూసి పిల్లలంతా కేరింతలు కొడుతూ హాయిగా నవ్వుతున్నారు. పక్షులన్నీ తమ తమ గూళ్ళకు చేరుకుంటున్నాయి..

"అరుంధతీ... అరుంధతీ..." అంటూ పిలుస్తూ కూరగాయల సంచీతో లోపలికొచ్చాడు రామనాథం. "ఆ! వస్తున్నానండి" అంటూ కాఫీ కప్పుతో వచ్చిందది అరుంధతి. కాఫీ ఇచ్చి కూరగాయలు చూస్తూ ఎలా ఉన్నాయి ధరలు అంటూ అడిగింది. ఏమడుగుతావులే ఆకాశాన్నంటుతున్నాయి. వాటిని అందుకోవడానికి ఎన్ని నిచ్చెనలు కావాలో నిట్టూరుస్తూ అన్నాడు రామనాథం నిర్లిప్తంగా.

"ఈ రాత్రికి ఏం కూర చేయమంటారు" అడిగింది భర్తను. "నీ ఇష్టమున్నది చేయవోయ్, నువ్వేది చేసినా తింటాను కదా!" అన్నాడు నవ్వుతూ. "అలా అని కాదు, మిమ్మల్ని అడగడం అదో అలవాటైపోయింది" అంది తనూ నవ్వుతూ.

"అలాగయితే గుత్తి వంకాయ కూర చేయి. నాలుక చప్పబడిపోయిందీమధ్య" అన్నాడు. "అలాగే" అంటూ వంటింట్లోకెళ్ళింది అరుంధతి.

వాలు కుర్చీలో కూర్చొని కళ్ళు మూసుకొని

వెనక్కి జారగిలబడి కూనిరాగం తీయబోయాడు కానీ, అంతలోనే తన చిన్ననాటి కోరిక గుర్తుకు వచ్చేసరికి మనసు చివుక్కుమంది.

తన జీవితం నిజంగా నందనవనం. నాలుగు పూల మొక్కల్ని నాటి వాటికి ప్రేమను పంచుతూ అపురూపంగా పెంచుకున్నాడు. ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు . అమ్మాయిలిద్దరూ పెద్దవారు. కూతుళ్ళు పుట్టగానే ఆపరేషను చేయించుకోమని ఎన్నిసార్లు చెప్పినా వినలేదు అరుంధతి. వంశోద్ధారకుడు కావాలని పట్టుబట్టింది. ఫలితంగా అబ్బాయి పుట్టాడు. ఈసారైనా ఆపరేషన్ చేయించుకోమంటే అస్సలు వినలేదు. ఒక్క కొడుకు కొడుకు కాదు. ఒక్క కన్ను కన్ను కాదు అంటూ ఈసారి ఖచ్చితంగా అబ్బాయే పుడతాడు. ఈ కాన్పు తర్వాత తప్పకుండా ఆపరేషన్ చేయించుకుంటాను అంది మొండిగా.

అతని బడ్జెట్ ఇప్పటికీ సరిగా సరిపోవడం లేదు. బ్రతకలేక బడిపంతులు అన్నట్లు బొటాబొటీ జీతం రాళ్లతో ఆరుగురిని తను పెంచగలడా అనుకొని బాధపడ్డాడు. కానీ, భార్య మాట కాదనలేకపోయాడు. మళ్లీ అబ్బాయి పుట్టాడు. మారు మాట్లాడకుండా ఆపరేషన్ చేయించుకుంది అరుంధతి.

భార్యను, పిల్లలను కంటికి రెప్పలా చూసుకున్నాడు. ఎవరికి ఏ లోటు రాకుండా అడిగిందల్లా కొనిస్తూ అందరిని ప్రయోజకుల్ని చేశాడు. అబ్బాయిలిద్దరు పెద్ద చదువులు చదివి, విదేశాల్లో స్థిరపడ్డారు. అమ్మాయిలకు మంచి సంబంధాలు చూసి పెళ్ళిళ్లు చేశాడు. మనసుకెంతో హాయిగా ఉంది. ఎవరన్నా చిన్నప్పటి ఫ్రెండ్స్ కలసినప్పుడు అదృష్టమంటే రామనాథందే అంటే మాత్రం అవును నాదే అంటూ గర్వంగా గుండెలమీద చెయ్యి వేసుకొని మరీ చెప్తాడు. కానీ, అతని మనసులో మాత్రము ఎవ్వరికి తెలియని, చివరకు భార్యకు కూడా తెలియని కోరిక ఒకటి మిగిలిపోయింది. అది అప్పుడప్పుడూ మనసులో ముల్లులా గుచ్చుకుంటూనే ఉంది.

పెళ్లికి ముందే అది కావాలని వాళ్ల నాన్నతో పోట్లాడాడు. ఆయనా కొనివ్వలేదు. స్తోమతకు తగని కోరికలు మంచివికావు. అప్పట్లో తన కోరికకు ఆనకట్ట వేశాడు.

తను సంపాదనలో పడ్డాక బాధ్యతలు సహకరించలేదు. ఎప్పుడు కొనుక్కుందామన్నా చాలీచాలని బడ్జెట్‌లో ఏదో ఒక ఖర్చుతో సతమతమయ్యే తనకు ఇప్పటికీ వీలు పడలేదు.

ఇప్పుడు అలాంటి ఇబ్బంది లేదు. కానీ, ఈ వయసులో తన కోరికను విని ఎవరైనా నవ్వుతారేమోనన్న జంకు, భార్య ఎగతాళి చేస్తుందేమోనన్న భయం అతన్ని భయపెడ్తున్నాయి.

తన చిన్నప్పటి ఫ్రెండ్ రాఘవరావు వస్తున్నట్లుగా టెలిగ్రాం ఇచ్చాడు. అది చూసి చాలా సంతోషించాడు రామనాథం. స్టేషన్‌కెళ్ళి రిసీవ్ చేసుకున్నాడు. కుశల ప్రశ్నలయ్యాయి. "ఏమ్మా బాగున్నావా" అంటూ అరుంధతిని పలకరించాడు.

"ఆ బాగున్నాను అన్నయ్యా! వదిన, పిల్లలు బాగున్నారా?" అంటూ ఎదురు ప్రశ్నించింది అరుంధతి.

"ఆ! బాగున్నారు కానీ, మీలా మాకు బాధ్యతలు తీరలేదుకదమ్మా" అన్నాడు కొంచెం బాధపడుతూ. అమ్మాయి పెళ్ళయితే అయిందే కానీ, అల్లుడితో ఎప్పుడూ ఏదో గొడవ మనశ్శాంతి లేకుండా... మగపిల్లల చదువులు అయ్యాయి కానీ, ఉద్యోగాలే రాలేదు. ఎప్పుడొస్తాయో ఏమో అన్నాడు దిగులుగా.

దొరుకుతాయిలే అన్నయ్యా, నువ్వేం బాధపడకు అంది ధైర్యంగా చెపుతూ. భోజనాలు ముగిసాయి. స్నేహితులిద్దరూ ఆరుబయట కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో గుర్తొచ్చింది రామనాథానికి, ఫ్రెండ్‌తో తన మనసులో మాట చెబితే అతనేమంటాడో తెలుసుకుంటే తర్వాత కొనుక్కోవడమో, మానుకోవడమో నిర్ణయించుకోవాలి అనుకున్నాడు.

మాటల మధ్యలో తన మనసులో మాట చెప్పాడు. అతని కోరికకు రావు పడి పడి నవ్వుతూ! రామనాథం ఏమన్నాడో అన్న సంశయంతో ఏం కొనాలనుకుంటున్నావు అని మళ్లీ అడిగాడు.

మళ్ళీ అదే విషయం చెప్పాడు రామనాథం.

నవ్వాపుకోలేకపోతున్నాడు రావు. ఇంత చిన్న కోరిక నువ్వు ఇన్నిరోజులు వెయిట్ చేశావా? నమ్మలేకుండా ఉన్నానురా అన్నాడు రావు.

నువ్వలాగే అంటావులేరా! మధ్య తరగతి వాళ్ల గురించి నీకేం తెల్సు. పది రూపాయలు ఖర్చు చేయాలన్నా ఆలోచించాల్సిందే అన్నాడు.

అయిందేదో అయింది రేపు షాపింగ్‌కి వెళదాం అన్నాడు రావు.

మర్నాడు ఇద్దరు కలసి షాపింగ్‌కు బయలుదేరారు. షాపులన్నీ తిరిగి తనకు నచ్చినది కొనుక్కున్నాడు రామనాథం. సంతోషం పట్టలేకపోయాడు. కోరిక చిన్నదే; చిన్నప్పుడు తన ఫ్రెండ్‌ను చూసి కొనాలనుకున్నాడు. అప్పట్లో తీరలేదు కానీ అది మాసిపోలేదు. తనతోపాటు పెరిగి పెద్దదయిన కోరిక ఇన్నాళ్లకు తీరింది.

"థాంక్స్‌రా రావు" అన్నాడు మనస్ఫూర్తిగా రామనాథం. "ఇట్స్ ఓకే" అన్నాడు భుజం తడుతూ రావు.

వారంరోజులయినా దాన్ని బయటకు తీయలేదు రామనాథం. ఎందుకో అతనికి చాలా సిగ్గుగా ఉంది. ఓరోజు సాయంత్రం అరుంధతి "ఏమండి ఈవేళ మన వెంకటేశ్వరస్వామి గుడిలో హరికథ చెబుతున్నారట వెళ్ళొస్తాను అంది. ఆ మాటలు చెవిలో అమృతం పోసినట్లయింది రామనాథానికి. ఎప్పుడెప్పుడు భార్య బయటకెళుతుందా తనెప్పుడు దాన్ని తనివితీరా చూసుకోవాలని, వినాలని ఎదురుచూస్తున్నాడు. ఇది మంచి సమయం అనుకొని 'వెళ్లు అరుంధతి' అన్నాడు సంతోషంగా.

హరికథ విని ఇంటికొచ్చిన అరుంధతి భర్తను చూసి నివ్వెరపోయి ముక్కున వేలేసుకుంది. తన లోకంలో విహరిస్తున్న రామనాథానికి భార్య వచ్చిన సంగతి తెలియలేదు. ఈజీ చైర్‌లో వెనక్కి వాలి కళ్లుమూసుకొని చెవుల్లో తన చిన్ననాటి కోరికైన 'వాక్‌మెన్'తో తన కిష్టమైన సంగీతం వింటున్న రామనాథం భార్యను చూసి కొయ్యబారిపోయాడు. "ఏమండీ ఇదెక్కడిది? నాకు వాక్‌మెన్‌లో పాటలు వినాలని చిన్నప్పటి కోరిక" అంది. "మా అమ్మను కొనివ్వమంటే కోప్పడింది. మిమ్మల్ని అడిగితే ఏమంటారోనన్న భయంతో ఇన్నాళ్లు అడగలేదు. ఒకసారి నేను కూడా వింటానండి" అంది సంతోషంగా అరుంధతి. ఈసారి నోరు తెరవడం రామనాథం వంతయింది.

*

